కులగణనపై బీసీల కన్నెర్ర

- తప్పుల తడకగా కులగణన..
- ఎన్యుమరేటర్లు కూర్చున్న చోటే లెక్కలు రాసుకొని నివేదికలు తయారు చేశారు..
- స్థానిక సంస్థల్లో లబ్ధిపొందడమే లక్ష్యంగా ఈ సర్వే ఉంది..
- మండిపడుతున్న బీసీ నేతలు

మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు

మేడ్చల్, ఫిబ్రవరి 5: కుల గణన సరిగా జరగలేదు. వందకు వంద శాతం ప్రభుత్వం చెబుతున్న లెక్కలు తప్పు. సమగ్రంగా జరిగి ఉంటే బీసీలకు జనాభా తగ్గేది కాదు అని బీసీ నేతలు బీసీ గణనపై మండి పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చెప్పిన బీసీ లెక్కలు ముమ్మాటికీ తప్పులతడకగా జరిగిందని, ఎన్యుమరేటర్లు పూర్తిస్థాయిలో ప్రజలను సంప్రదించకుండానే నివేదికలు తయారు చేశారని స్పష్టం అవుతుందన్నారు. ప్రభుత్వానికి సమగ్ర కుల గణనపై చిత్తశుద్ధి చూపలేదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడమే లక్ష్యంగా ఈ సర్వే, గణాంకాలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీసీ గణనపై కేంద్రం కుంటి సాకులు

బీసీ గణనపై కేంద్రం కుంటి సాకులు చెబుతూ బీసీలకు అన్యాయం చేస్తుందని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు దశరథ్ అన్నారు. బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం బీసీ సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీసీలకు న్యాయం జరగాలంటే జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న గణన జరగాలన్నారు. కులాల వారీగా జనగణన చేసి, జనాభా ప్రకారం విద్యా, ఉపాధి రంగాల్లో వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాని, ఈ పార్లమెంట్ సమావేశాల్లో బీసీలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్‌ను కల్పించే బిల్లు పెట్టాలని, రూ.2 లక్షల కోట్లను బీసీలకు అభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయించాలని, బీసీ అట్రాసిటీ చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. నాయకులు కాసర్ల నాగరాజు, నరేంద్ర చారి, లక్ష్మి, కృష్ణ, రాజేశ్వరి, సాయిలు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్యుమరేటర్లు కూర్చున్నచోటే లెక్కలు రాసుకున్నారు..

సమగ్ర కుల గణన సర్వే జరిగా జరుగలేదు. సర్వే నిర్వాహకులు ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించలేదు. కూర్చొన్న చోటనే లెక్కలు రాసుకున్నారు. ఎంతో మంది మా ఇంటికి రాలేదంటే.. మా ఇంటికి రాలేదని చెప్పారు. ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పూర్తి స్థాయిలో సర్వే జరుగలేదు. మా ఒక్క గ్రామంలోనే ఇలా ఉంటే మండలం, జిల్లా, రాష్ట్రంలోనే పరిస్థితి ఏంటి. బీసీల్లో ముదిరాజ్‌లు, గౌడ్‌లు, మున్నూరు కాపు, కమ్మరి, కుమ్మరి తదితర కులాల వారు అధిక సంఖ్యలో ఉన్నారు. 46 శాతం మాత్రమే బీసీలు ఉన్నారని చెప్పడం బీసీలను మోసం చేయడమే. తమ కులం పరంగా రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో మండల, గ్రామస్థాయిలో తాము మున్నూరుకాపు సంఘటన తరుపున సర్వే నిర్వహించాం. మున్నూరు కాపులకంటే ముదిరాజ్‌లు, గౌడ్‌లు అధికంగా ఉన్నారు. అన్ని బీసీ కులాల కలుపుకుంటే 50 శాతానికి మించి ఉంటారు. అంతేగానీ 46 శాతానికి పడిపోయినట్టు సమగ్ర కుల గణన సర్వేలో చూపడం దారుణం. బీసీలు పెండ్లీలు కావడం లేదా? పిల్లలు పుట్టడం లేదా? జనాభా పెరగాలని గానీ తగ్గుతుందా? ఈ నివేదికను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం.

– మామిండ్ల శ్రీనివాస్, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నేత

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీ 42 శాతం రిజర్వేషన్‌ను కల్పించే విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆదరాబాదరాగా సమగ్ర కుల గణన నివేదికను ప్రకటించారు. గతంలో 1.86 కోట్లతో 51 శాతం ఉన్న బీసీలు 1.64 కోట్లతో 46 శాతానికి ఎలా తగ్గుతారు. కేసీఆర్ సారధ్యంలో ఒకేరోజు రాష్ట్ర వ్యాప్తంగా సర్వే జరిగినా శాస్త్రీయ పద్ధతిలో అన్ని ఇండ్లకు వెళ్లి సర్వే చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సర్వే నిర్వహణలో స్పష్టత లేదు. నిర్లక్ష్యం కూడా కన్పించింది. మేడ్చల్‌లో జాతీయ రహదారి పొడువునా సర్వే ఫారాలు కన్పించడమే ఇందుకు నిదర్శనం. పార్టీ పరంగా రిజర్వేషన్‌ను కల్పిస్తాం. బీసీల సంఖ్యను కూడా తక్కువ చేసి చూపి, వారిని వంచించింది. బీసీ జనాభా 50 శాతం కంటే ఎక్కువగా ఉంటుంది. బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీల చేతిలో ఘోరపరాభవం తప్పదు.

– బాసురాది భాస్కర్ యాదవ్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మేడ్చల్

బీసీ జనాభా లెక్కలు తప్పుల తడక

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ జనాభా లెక్కలు తప్పుల తడుకగా ఉన్నాయి. బీసీ జనాభాను తక్కువ సంఖ్యలో చూపించి ప్రజాస్వామ్యంగా రావాల్సిన వాటాను, రిజర్వేషన్లలో కాంగ్రెస్ మోసం చేస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టినటువంటి రిజర్వేషన్‌ను వెంటనే నిలిపివేసి, వెంటనే కొత్తగా సర్వేను చేపట్టాలి. సర్వే చేయని పక్షంలో పెద్ద ఎత్తును నిరసనలు చేపడుతాము.

– దుర్గం సాయినాథ్ గౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత, కీసరగుట్ట ట్రస్టు బోర్డు మాజీ సభ్యులు

కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారు

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఎమ్మెల్సీ కవితతో బబ్లూసింగ్,అంటో,కార్యకర్తలు

కాచిగూడ,ఫిబ్రవరి 5: మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి, దేశంలోనే అగ్రగామిగా నిలిపారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కాచిగూడలో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కవిత హాజరై మాట్లాడుతూ.. ఇటీవల సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు తెలంగాణలో ఉప ఉన్నికలు తథ్యమని, అందుకు ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్‌ఎస్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. భూటకపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఆమె వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టి ఏడాది గడిచినా ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాడని ఆమె ఆరోపించారు. రానున్న జెడ్‌పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా, అండగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌ది.. కొత్త రకం మోసం

తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ

బీసీ సాధికారత భవన్‌లో విముక్తి రాజకీయ కవితా సంపుటి పుస్తకావిష్కరణ

విముక్తి రాజకీయ కవితా సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ తదితరులు

సుల్తాన్‌బజార్,ఫిబ్రవరి 5: సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుల గణన చేపట్టి తద్వార స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని నమ్మించి మోసం చేసిందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ ఆరోపించారు. ఈ మేరకు హునమాన్‌టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో తెలంగాణ బీసీ కులాల ఐక్య వేదిక అధ్యక్షుడు పాండు యాదవ్ ఆధ్వర్యంలో వేదిక సీనియర్ నాయకులు అక్కల బాబుగౌడ్ రచించిన విముక్తి రాజకీయ కవితా సంపుటి పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..వస్తదో రాదో తెలియని రిజర్వేషన్ల పెంపు స్థితి చర్యలు చూపించి, శాశ్వత బీసీల జనాభాను మోసపూరితంగా 54శాతం నుండి 46 శాతం తగ్గించి, 6.5 శాతం ఉన్న వారి జనాభాను 16 శాతం పెంచడానికి ఈ అధికారిక చర్యలు ఉపయోగించుకొని గతంలో జరిగిన మోసాల కంటే బీసీల పట్ల కొత్త రకం మోసానికి సీఎం రేవంత్‌రెడ్డి ఒడిగట్టారని ఆయన దుయ్యబట్టారు. గత మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో 51 శాతం బీసీలు ఉన్నారనే గణాంకాలు తమ సర్వేలో వచ్చాయని తెలపడం ఆ సమయంలో ఆ సర్వేలను అధికారికంగా ఎందుకు ముందుంచలేదని ఆయన ప్రశ్నించారు. ఈ అంశంతో పాటు వివిధ అంశాలపై, ప్రభుత్వాల పార్టీల మోసాలపై ఈ నెల 22న విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, వచ్చే నెల 9న వేదిక సీనియర్ నాయకులు డాక్టర్ నరహరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జుక్కల్ మహాసభకు అందరూ హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వీజీఆర్ నారగోని, నాగుల శ్రీనివాస్ యాదవ్,సంధ్య,కాశీనాథ్,అరుణ్,చెన్నయ్య,ఆరెపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మిన మాలలను నట్టేట ముంచిన కాంగ్రెస్

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు, నిరసనలు తెలుపుతున్న మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య ఇతర మాల నేతలు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 5:నమ్ముకున్న మాలలను కాంగ్రెస్ పార్టీ నట్టేట ముంచిందని, కాంగ్రెస్ పార్టీని రాబోయే రోజుల్లో బొందపెడుదామని మాల సంఘాల నేతలు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అంబేద్కర్ వాదులైన మాలలను కాంగ్రెస్ పార్టీకి దూరం చేసేందుకు మంద కృష్ణ మాదిగ, చంద్రబాబుతో కుమ్మక్కై వర్గీకరణ ద్వారా మాలలకు అన్యాయం చేశారని మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య మండిపడ్డారు. మంగళవారం అంబేద్కర్ విగ్రహం ఎదుట మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి. చెన్నయ్య, కో-చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు,చెరుకు రాంచందర్, గోపాజు రమేశ్, కరణం కిషన్, మన్నె శ్రీధర్‌రావు,అంగిరి ప్రదీప్, మంచాల లింగస్వామిలతో కలిసి చైర్మన్ జి.చెన్నయ్య ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం పోలీసులు వారిని అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్‌లోకి తరలించారు. ఈ కార్యక్రమంలో మన్నె రంగా, నాను, తాలూకా రాజేశ్, నామ సైదులు, సరళ, అంజలి, రమ,లలిత, మంగ, విశాల్, దుబ్బాక నవీన్, మారుతి, ఆదర్శ్, పవన్, చేతన్, సత్యనారాయణ, దాసరి భాస్కర్,మన్మోహన్, అనిల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రకటించిన జిల్లా అధ్యక్షుల జాబితాలో యాదవులకు ఒక్క పదవి దక్కలేదు

జాతీయ యాదవ పోరాట హక్కుల సమితి అధ్యక్షులు మేకల రాములు యాదవ్

బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించిన యాదవ హక్కుల పోరాట సమితి

నాంపల్లిలోని బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు బ్యారికేడ్లను దాటి ముందుకు దూసుకువస్తున్న యాదవ హక్కుల పోరాట సమితి నాయకులు

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 5: తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పార్టీ యాదవులను పూర్తి స్థాయిలో విస్మరిస్తుందని జాతీయ యాదవ పోరాట హక్కుల సమితి అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ మండిపడ్డారు. బుధవారం పోరాట సమితి ఆధ్వర్యంలో నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పెద్దెత్తున నినాదాలు చేస్తూ ఆఫీస్ వద్ద ఆందోళనకు దిగారు. ముట్టడికి యత్నించిన సమితి నాయకులను అడ్డుకునేందుకు పోలీసులు బ్యారీకేడ్లను అడ్డుపెట్టినా వాటిని దాటి ముందుకు వచ్చేందుకు యత్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవులకు ఎటువంటి పదవులు ఇవ్వలేదని, ఇటీవల బీజేపీ ప్రకటించిన జిల్లా అధ్యక్షుల జాబితాలో యాదవులకు ఒక్క పదవి దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలోనూ బీజేపీ పార్టీ యాదవులకు తగిన ప్రా ధాన్యత ఇవ్వలేదని ఆయన మండి పడ్డారు. యాదవులకు జిల్లా అధ్యక్ష పదవులను ఒక్కటి ఇవ్వనందుకు నిరసనగా బీజేపీ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి గుడిగే శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలకల శ్రీనివాస్ యాదవ్, నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షులు కుందేళ్ల శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

దేశ వ్యాప్తంగా కులగణన నిర్వహించాలి: జాతీయ బీసీదళ్

కులగణన సర్వే పత్రాలతో జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

కాచిగూడ,ఫిబ్రవరి 5:గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీసీ నినాదం బలంగా ఉందని, అందుకు కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కుల గణన జరిగినప్పుడే బీసీల సమస్యలు పరిష్కారమవుతాయని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. బుధవారం కాచిగూడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రారంభమైన ఇంటింటి సమగ్ర కులగణన సర్వే మాదిరిగా కేంద్రం దేశ వ్యాప్తంగా చేపట్టాలని, బీజేపీ మంత్రులు, ఎంపీలు కులగణనపై ప్రధానిపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. బీసీలు ఓటర్లుగా కాకుండా నాయకత్వ లక్షణాలను అలవర్చుకోలని పిలుపునిచ్చారు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమం లాగా బీసీ ఉద్యమం వచ్చినప్పుడే బీసీల బతుకులు మారుతాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బీసీ దళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ కులగణన ఫేక్.. బీసీ నాయకులారా గళం ఎత్తండి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన బీసీల కోసం కాదని, సీఎం రేవంత్‌రెడ్డి తన సీఎం పీఠాన్ని కాపాడుకోవడానికి చేసిన సర్వే అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో బీసీ కులగణనపై జరిగిన 'పరిణామాలు-సీఎం తప్పుడు లెక్కలు-భవిష్యత్తు కార్యాచరణ' అనే అంశంపై బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో బీసీ సంఘాలు, బీసీ మేధావులతో ఆయన అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ..ఈ సర్వేను బీసీలు తిరస్కరిస్తున్నారని, ఫేక్ సర్వే అని అన్నారు. తప్పుల తడకగా సర్వే జరిగిందన్నారు. ఈ విషయాన్ని దేశ వ్యాప్తంగా ప్రచారం చేస్తామన హెచ్చరించారు. తప్పుల తడకగా చేసిన సర్వే తప్పును కప్పిపుచ్చుకోవడానికి మరో వంద తప్పులకు ప్రభుత్వం పాల్పడుతుందని వివరించారు. బీసీ కులగణనపై తీర్మానం చేసినట్లుగా అసెంబ్లీలో సీఎం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను త్వరితగతిన నిర్వహించాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తమ ప్రణాళికతో వారి ఆటకట్టిస్తామని హెచ్చరించారు. దామోదర్ రాజనర్సింహను చూసి బీసీ మంత్రులు సిగ్గు తెచ్చుకోవాలన్నారు. రేవంత్‌రెడ్డి చుట్టూ భజన చేయకుండా బీసీ నాయకులారా బీసీ కులగణనపై గళమెత్తాలని కోరారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బీసీ కమిషన్ పూర్వ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు పాల్గొన్నారు.

ఆశలకు రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి

తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ)రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి డిమాండ్

ఆశల సమస్యలు పరిష్కరించాలని ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి, రాష్ట్ర కోశాధికారి గంగమణి

సుల్తాన్‌బజార్,ఫిబ్రవరి 5: రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ)రాష్ట్ర అధ్యక్షులు పి జయలక్ష్మి అన్నారు. బుధవారం రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌ను ఆమె యూనియన్ రాష్ట్ర కోశాధికారి పి.గంగమణితో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 2023లో 15 రోజుల పాటు ఆశ వర్కర్లు నిరవధిక సమ్మె, పెద్దెత్తున ధర్నా నిర్వహించామన్నారు. నాటి డీహెచ్ శ్రీనివాసరావు యూనియన్ రాష్ట్ర కమిటీతో చర్చలు జరిపి నిర్దిష్టమైన హామీలను ఇవ్వడం జరిగిందన్నారు. తదనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో తన మ్యానిఫెస్టోలో ఆశ వర్కర్లకు వేతనాలను పెంచుతామని,ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామినిచ్చిందని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. నిరంతరం అనేక ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంపై ఆశలు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈనెలలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించడంతోపాటు ప్రమోషన్, పీఎఫ్, ఈఎస్‌ఐ,ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

- ఈ నెల10 నుంచి 17వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- 25న ఎన్నికలు .. ఎన్నికల ఏడాది కావడంతో హీటెక్కిన రాజకీయం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 5(నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీ స్థాయీ సంఘం సభ్యుల ఎన్నికకు బుధవారం అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ఏడాది కాల పరిమితితో ఉండే 15 మంది సభ్యుల పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగుస్తున్న నేపథ్యంలో ఎన్నికలకు సిద్ధమయ్యారు. ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. ఆదివారం (16వ తేదీ మినహా) మిగిలిన రోజుల్లో జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఔత్సాహికులు ఎన్నికల విభాగం అదనపు కమిషనర్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు సమర్పించాలని అధికారులు తెలిపారు. 18న నామినేషన్ల పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు బరిలో ఉండే అభ్యర్థుల ప్రకటనను అధికారులు విడుదల చేయనున్నారు. ఈనెల 25వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పోలింగ్, కౌంటింగ్ 3 గంటల తర్వాత ఉండనున్నదని అధికారులు పేర్కొన్నారు.

జీహెచ్‌ఎంసీలో హీటెక్కిన రాజకీయం..

జీహెచ్‌ఎంసీలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈనెల 11న తర్వాత మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిలపై అవిశ్వాసానికి సిద్ధమవుతున్నట్లుగా బీఆర్‌ఎస్ వర్గాలు లీకులు ఇవ్వడం, మరోవైపు స్టాండింగ్ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడం, అన్నింటి కంటే మించి ఎన్నికల ఏడాది కావడంతో అన్ని పార్టీలు యాక్టివిటీని పెంచాయి. ఈ నేపథ్యంలోనే డివిజన్లలో పెండింగ్ సమస్యలపై నివేదికలు తీసుకుని పరిష్కరించాలంటూ కమిషనర్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. డివిజన్‌కు రూ.25 కోట్ల మేర నిధులు మంజూరు చేయాలని స్టాండింగ్ కమిటీ సభ్యులు కమిషనర్ ముందు ప్రతిపాదనలు పెట్టారు. కమిషనర్ మాత్రం సర్కిల్‌కు రూ.6 కోట్ల మేర కేటాయించే దిశగా ఆలోచన చేస్తున్నారు. నాలా, ఇతర ప్రధాన సమస్యలపై ఫోకస్ చేయనున్నారు. ఇక ఎన్నికల ఏడాది కావడంలో పెండింగ్ పనులను పట్టాలెక్కించేందుకు ఆయా పార్టీల కార్పొరేటర్లు తాపత్రయ పడుతున్నారు.ఇదిలా ఉండగానే స్టాండింగ్ కమిటీలు రావడంతో అన్ని పార్టీలు అలర్ట్ అయ్యాయి. ఈ ఎన్నికలు ప్రతిసారి ఏకగ్రీవం అవుతూ వస్తున్నాయి. కౌన్సిల్‌లో బీఆర్‌ఎస్, ఎంఐఎం బలంగా ఉండటంతో ఆ రెం డు పార్టీల సభ్యులే స్టాండింగ్ కమిటీలో ఉం టున్నారు. ఐతే ఇటీవల బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు 21 మంది వరకు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. మేయర్ , డిప్యూటీ మేయర్ కాంగ్రెస్ పార్టీలోనే ఉండటం, ఎంఐఎం పార్టీ సైతం అధికార పార్టీతో అంటగాగుతుండడం తో ఈ సారి స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం కౌన్సిల్‌లో 150 మంది డివిజన్లకు గానూ బీజేపీ 41, ఎంఐ ఎం 41, బీఆర్‌ఎస్ 40, కాంగ్రెస్ 24 సభ్యులతో బలబలాలు ఉన్నాయి. ఐతే ప్రతిసారి మాదిరిగానే బీజేపీ ఈ ఎన్నికకు దూరంగా ఉండే అవకాశాలు ఎక్కువగా కనబడుతున్నా యి. కాంగ్రెస్‌కు పెద్దగా బలం లేకున్నా వారి అడుగులు ఎటు వైపు అన్నది చర్చ జరుగుతున్నది. ప్రధానంగా బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీ సభ్యులే ఈ ఎన్నికల్లో కీలకం కానున్నాయి.

పారిశ్రామిక వసతుల కల్పనకు జీసీసీ దోహదం

ఐటీశాఖ కార్యదర్శి జయేశ్ రంజన్

జీసీసీ కంక్లేవ్-2025లో ముఖ్యఅతిథిగా హాజరైన ఐటీ శాఖ రాష్ట్ర కార్యదర్శి జయేశ్ రంజన్ ఇతర ప్రముఖులు

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 5: ద్వితీయ శ్రేణి నగరాల్లో ప్రభుత్వ పరంగా కావాల్సిన పారిశ్రామిక మౌలిక వసతులు, మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు జీసీసీ(గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు) కంక్లేవ్ ఎంతగానో దోహదపడుతుందని తెలంగాణ రాష్ట్ర ఐటీశాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. బుధవారం నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని షెరటాన్ హోటల్‌లో హ్యూమనైజ్, మూవ్ ఇన్ సింక్‌ల సంయుక్త అధ్వర్యంలో ఏర్పాటైన 'మూవ్ ఇన్ సింక్ జీసీసీ కంక్లేవ్-2025'లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో 280కి పైగా జీసీసీలు ఉన్నాయని, విదేశీ కంపెనీలు తమ జీసీసీలను ఇక్కడ స్థాపించుకోవడం జరిగిందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఈ తరహా కంక్లేవ్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. మూవ్ ఇన్ సింక్ సీఈఓ దీపేశ్ అగర్వాల్, హ్యూమనైజ్ సీఈఓ జగదీశ్ మిత్రలతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

9 తర్వాత ఎప్పుడైనా ఆర్టీసీ సమ్మె

- సమ్మె చేయొద్దంటూ ఆర్టీసీ ఉద్యోగులకు యాజమాన్యం హెచ్చరికలు
- గేట్ మీటింగ్‌లు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని కార్మికుల ఆవేదన

సిటీబ్యూరో, ఫిబ్రవరి 5(నమస్తే తెలంగాణ): చాలీ చాలని జీతాలు.. పనిభారం మోస్తూ ఇబ్బందులకు గురవుతున్న ఆర్టీసీ కార్మికులపై సర్కార్ కక్ష్య కడుతున్నది. ఓవైపు బస్సుల సంఖ్య తక్కువగా ఉన్నా.. ప్రయాణికుల రద్దీ పెరిగినా విధులు నిర్వర్తించడంలో వెనుకడుగువేయకుండా ఆర్టీసీకి ఆదాయం తీసుకొస్తున్న కార్మికులపై బెదిరింపులకు పాల్పడుతున్నారని వాళ్లంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమ్మె నోటీసు ఇచ్చినప్పటి నుంచి కార్మికులపై ఆర్టీసీ యాజమాన్యం బెదిరింపులకు దిగుతుందని ఆర్టీసీ జాక్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజు మూడుసార్లు గేట్ మీటింగ్‌లు పెడుతూ సమ్మెలో పాల్గొనకూడదని హెచ్చరిస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెకు దిగితే కేసులు నమోదు చేస్తామని.. తిరిగి ఉద్యోగాల్లో జాయిన్ అవ్వాలంటే కష్టపడాల్సి వస్తుందని మైండ్ వాష్ చేస్తున్నట్టు తెలిపారు. ఉద్యోగుల లీవ్స్, గైర్హాజరు, గతంలో ఉన్న ఆరోపణలపై విచారణ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని బెదిరిస్తున్నట్టు గ్రేటర్‌లో ఓ డిపోకు చెందిన కండక్టర్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఎన్ని బెదిరింపులకు పాల్పడినా సమ్మె చేయడం తథ్యమని కార్మికులు ఘంటాపథంగా చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 40వేలకు పైగా ఆర్టీసీ కార్మికులు ఉన్నారు. వీళ్లలో కొంతమందిని ప్రభుత్వానికి అనుగుణంగా ఉన్నవారితో సమ్మెపై వ్యతిరేక ప్రచారం చేయిస్తున్నారని జేఏసీ నాయకులు విమర్శించారు. ఆర్టీసీని ప్రైవేట్ పరం చేయడానికి కాంగ్రెస్ సర్కార్ పూనుకుందని నాయకులు వెంకన్న, థామస్ రెడ్డి ఆరోపించారు. ఈ ఏడాదిలో 2800 ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులు రాబోతున్నాయని సర్కార్ చెబుతున్నదన్నారు. మహిళా సంఘాల చేత 600 ప్రైవేట్ బస్సులు కొంటామని రవాణాశాఖ మంత్రి చెబుతుండటం ఆర్టీసీ కార్మికుల్లో భయాన్ని నింపుతుందని చెప్పారు. ఆర్టీసీని ప్రైవేట్‌పరం చేసే కుట్రను తిప్పికొడతామన్నారు. ఈవీ బస్సులు రావాలనుకుంటే వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని హితవు పలికారు. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయాలని కోరారు. కాగా, ఇప్పటికే అన్ని సంఘాల మద్దతు కూడగట్టినట్టు జాక్ నాయకులు తెలిపారు. ఫిబ్రవరి 9 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు దిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ డిపోల్లో జేఏసీ పర్యటించిందని, సమ్మెకు అందరూ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కరపత్రాలు, వాల్ పోస్టర్లు ఆవిష్కరించినట్టు పేర్కొన్నారు.

సీఎండీని కలిసిన తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్



తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీని కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రూపొందించిన డైరీని అందజేశారు. దక్షిణ డిస్కం వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి డిస్కం చేస్తున్న ప్రయత్నాలకు కాంట్రాక్టర్లు సహకరించాలని ముషారఫ్ సూచించారు. సీఎండీని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.మాజిద్‌తో పాటు శ్రీనునాయక్, తరుణ్, ఆసిఫ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు. *– సిటీబ్యూరో, ఫిబ్రవరి 5(నమస్తే తెలంగాణ)*